క్లుప్తంగా

చవితి ఉత్సవాలకు రాట మహోత్సవం



పందిరి రాట ఉత్సవంలో పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో వినాయక చవితి ఉత్సవాలకు రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ దుర్గా గణపతి దేవస్థానం వద్ద కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, జగదీశ్వరి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం రాట వేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామల దీపిక పాల్గొన్నారు. ఏటా దేవస్థానంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాబాయి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి డిప్యూటీ సీఎం క్రికెట్ టోర్నమెంట్

సీతమ్మధార : డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని సెప్టెంబర్ 2 నుంచి నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్‌లో గల జనసేన పార్టీ కార్యాలయంలో పోటీల ఫ్లెక్సీని బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.విద్యాసాగర్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని 98 వార్డుల నుంచి 98 జట్ల ఎంట్రీలను జనసేన కార్యాలయంలో ఈ నెల 28లోగా అందజేయాలని కోరారు. వన్‌టౌన్ వెలంపేటలో గల ఇందిరాగాంధీ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు వంతున నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఎం.గోపి, ఎస్.రవికుమార్, రూప, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక నిల్వలపై సెబ్ తనిఖీలు



ఇసుక నిల్వలు తనిఖీ చేస్తున్న సెబ్ అధికారులు

సీతమ్మధార : సీతమ్మధార స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఇసుక నిల్వలను బుధవారం తనిఖీ చేశారు. ఈ మేరకు సెబ్ ఇన్‌స్పెక్టర్ టి.వెంకటప్పలనాయుడు పర్యవేక్షణలో సీతమ్మధార, భానునగర్, మద్దిలపాలెం, తాటిచెట్లపాలెం, రామాటాకీస్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో గల ఇసుక నిల్వలను తనిఖీ చేశారు. అనుమానిత ప్రాంతాల్లో ఇటుక, కాంక్రీట్, రాయి విక్రయిస్తున్న స్టాక్ పాయింట్ల వద్ద తనిఖీలు చేశారు. ఎక్కడా అక్రమంగా ఇసుక నిల్వలు లభించలేదని ఇన్‌స్పెక్టర్ వెంకటప్పలనాయుడు మీడియాకు తెలిపారు. ఎవరైనా ఇసుక అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ ఎస్.ముసలనాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరెంజ్' బస్సులో 63 బీర్లు స్వాధీనం

సీతమ్మధార : తెలంగాణకు చెందిన ఒక వ్యక్తి విశాఖకు అక్రమంగా బీర్లు తరలిస్తుండగా ద్వారకా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కి చెందిన నరేంద్రబాబు 'ఆరెంజ్' ప్రైవేట్ ట్రావెల్ బస్సులో అక్రమంగా 63 టిన్ను బీర్లను విశాఖకు రవాణా చేశాడు. రామాటాకీస్ వద్ద ద్వారకా పోలీసులు బుధవారం నిర్వహించిన తనిఖీల్లో డ్రైవర్ క్రాంతికుమార్ (34) వద్ద 63 టిన్ను బీర్లను స్వాధీనం చేసుకున్నారు. బస్సు వెనుక ఒక కారులో నరేంద్రబాబు విశాఖ వచ్చాడని పోలీసులు తెలిపారు. ద్వారకా సీఐ ఎస్.రమేష్ పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య ధ్యాన కేంద్రాలు

మురళీనగర్‌లో ఉచితంగా యోగా, ధ్యాన శిక్షణ



వైశాఖి స్పోర్ట్సు పార్కులోని పిరమిడ్ ధ్యాన కేంద్రం



ప్రశాంతి పార్కులో వివేకానంద ఆధ్యాత్మిక ధ్యాన మందిరం



సుదర్శన్ పార్కులో నిర్మించిన ధ్యాన మందిరం

మురళీనగర్ : ఉరుకుల పరుగుల జీవన గమనంలో మనిషికి మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చింతన చాలా అవసరం. ఇందుకు వేదికగా ధ్యాన కేంద్రాలు నిలుస్తున్నాయి. మురళీనగర్ పరిసరాల్లోని వివిధ పార్కుల్లో నడకతోపాటు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ప్రత్యేక ధ్యాన మందిరాలు నిర్మించి ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ఇక్కడ యోగా, ధ్యానం శిక్షణ ఇస్తున్నారు.

ప్రశాంతతకు నిలయంగా పార్కు

మురళీనగర్ సెక్టార్ – 3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు ప్రశాంతతకు నిలయంగా నిలుస్తోంది. ఈ పార్కులో వివిధ ఆధ్యాత్మిక మందిరాలతోపాటు నగరంలోనే ప్రసిద్ధి చెందిన వివేకానంద ఆధ్యాత్మిక మండపం రూ.10 లక్షలతో నిర్మించారు. రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు యోగాలో భాగంగా సూర్య నమస్కారాలు చేయిస్తున్నారు. రిటైర్డ్ ఏఎస్ఐ నాయుడు ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి వివేకానంద కేంద్రంలో ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు వివేకానందుడి సాహిత్యాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. వివేకానందుడి నిలువెత్తు విగ్రహం ఆకర్షణీయంగా నిలుస్తూ ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. ప్రతి శనివారం సాయంత్రం శారదామాత బోధనలు నిర్వహిస్తున్నారు. 15 రోజులకు ఒకసారి ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ తరగతులు

మురళీనగర్ సుదర్శన్ పార్కులో ధ్యాన మందిరాన్ని రెండు అంతస్తుల్లో రూ.8 లక్షలతో నిర్మించారు. పైన 10/10 కొలతలతో పిరమిడ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7.30 వరకు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు, సోమవారం మహిళలకు ప్రత్యేకంగా ఉదయం 10 నుంచి 11 గంటల వరకు యోగా తరగతులు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్నారు. యోగాతోపాటు ప్రతీ శనివారం సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు సత్సంగ్ నిర్వహిస్తున్నారు. దసరా 10 రోజులు అమ్మవారికి ఉదయం పూజలు, సాయంత్రం భజనలు నిర్వహిస్తారు. యోగాలో రోజూ కనీసం 30 మంది పాల్గొంటున్నారు.

వైశాఖి స్పోర్ట్సు పార్కులో...

వైశాఖీ స్పోర్ట్సు పార్కులో వైశాఖి పిరమిడ్ ధ్యాన మందిరాన్ని రూ.1.50 లక్షలతో నిర్మించారు. ఇక్కడ రోజూ ఉదయం 6 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు కేంద్రం అందుబాటులో ఉంటుంది. మహిళలు బృందాలుగా వచ్చి ధ్యానం చేసుకుంటారు. ఎటువంటి ఫీజు లేకుండానే ధ్యాన మందిరాన్ని ఉపయోగించుకోవచ్చు. ప్రతి గ్రూపులో ఒక వ్యక్తి తరగతులు నిర్వహిస్తారు. ధ్యానంలో పూర్తిగా అవగాహన ఉన్న వారు వ్యక్తిగతంగా వచ్చి ధ్యానం చేసుకుంటారు. ఇవి కాకుండా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ ప్రజల్లో యోగా పట్ల అవగాహన కల్పిస్తున్నారు.

మనశ్శాంతి కలుగుతుంది



సుదర్శన్ పార్కులో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సుదర్శన క్రియ నేర్పిస్తాం. ఆరోగ్యం మెరుగుపరచుకోవచ్చు. మనశ్శాంతి కలుగుతుంది. నిత్యం ఆనందమయంగా ఉంటుంది. ఇక్కడికి సమస్యలతో మొదట వచ్చినప్పటికీ... తర్వాత జీవితాన్ని ఆనందంగా గడుపుతారు. ధ్యానం కూడా నేర్పిస్తాం. దీని వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. బీపీ, సుగర్ వంటి సమస్యలు తగ్గుతాయి.

– ఎంఆర్‌కే రంగారావు, సుదర్శన్ పార్కు కార్యదర్శి

ఆరోగ్యానికి ప్రాధాన్యం



మా పార్కులో ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. ధ్యాన కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. వాకింగ్ అనంతరం మందిరంలో ధ్యానం చేస్తున్నారు. పార్కులో ఇండోర్ బ్యాడ్మింటన్, స్కేటింగు రింక్ ఏర్పాటు చేశాం. ఓపెన్ జిమ్ పరికరాలు మహిళలు కూడా ఉపయోగించుకుంటున్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు.

– సనపల వరప్రసాద్, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మురళీనగర్ : జోన్ – 2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ 11 కేవీ ఫీడర్ ఏబీ స్విచ్ వర్క్, 11 కేవీ రైల్వే క్వార్టర్స్ ఏబీ స్విచ్ ఎరక్షన్స్ పనులు, కరాసా, ఎఫ్‌సీఐ 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 104 ఏరియా, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్, సిద్ధార్థ నగర్, గణేష్‌నగర్, శివ శివాని పాఠశాల రహదారి ప్రాంతం, భాస్కర్ గార్డెన్స్, శివనగర్, ఎఫ్‌సీఐ కాలనీ, సంకురుపేట ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

కొండవాలు ప్రాంతాల్లో పరిశీలన

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు బుధవారం పర్యటించారు. సత్యసాయినగర్, వరాహగిరికాలనీ – 2లో ఆయన పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న పలు సమస్యలను స్థానికులు కార్పొరేటర్‌కు వివరించారు. త్వరలోనే ఆ సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జీవీఎంసీ ఏఈ ఉమామహేశ్వరరావు, సచివాలయ సెక్రటరీలు, వర్క్సు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం

సీతమ్మధార : బీవీకే కళాశాలలు, సంస్కృత భారతి సంయుక్తంగా ద్వారకానగర్‌లోని బీవీకే కళాశాలలో సంస్కృత భాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించాయి. ముఖ్య అతిథిగా సంస్కృత భారతి విశాఖ జిల్లా అధ్యక్షుడు మహీధర నాగేశ్వరరావు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుమారి అనన్య సంప్రదాయ నృత్యంతోపాటు విద్యార్థుల గేయాలు, పుస్తక ప్రదర్శన, వస్తు ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీవీకే విద్యా సంస్థల కోశాధికారి వై.శ్రీధర్, కళాశాల ఇన్‌చార్జి ఆర్.ఊమా సుందరి, ప్రిన్సిపాల్ టి.గోవిందరావు, సంస్కృత విభాగ అధ్యాపకులు ఎన్.ద్రాక్షాయని పాల్గొన్నారు.

మహిళా చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ శ్రేణులు

సీతమ్మధార : దేశంలో మహిళల రక్షణ కోసం పలు చట్టాలున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయలేకపోతున్నాయని పలువురు వక్తలు ధ్వజమెత్తారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడారు. మహిళా చట్టాలు సక్రమంగా అమలు చేయలేని ప్రభుత్వాలు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. దేశవ్యాప్తంగా మహిళలపై రోజురోజుకీ దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.మణి మాట్లాడుతూ కోల్‌కతాలో జరిగిన ఘటన వెనుక పెద్ద కుట్ర వుందని ఆరోపించారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు స్పందించినా సరే ఇటు కేంద్ర ప్రభుత్వం, అటు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మౌనం పాటిస్తున్నాయని ఆరోపించారు. దేశంలో మహిళా చట్టాలు సక్రమంగా అమలు చేసేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఇక్కడ మానవహారం అనంతరం ఆశీలుమెట్ట, గురజాడ విగ్రహం జంక్షన్, సెంట్రల్ పార్కు మీదుగా గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి మేరీ, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ఆర్పీ, సిటు నాయకులు ఎ.సీతాలక్ష్మి, ఎం.సుబ్బారావు, కుమారి, చంద్రమౌళి, శివ, రాజు, పి.వెంకటరెడ్డి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలి

సీతమ్మధార : మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేయాలని మా సంస్కృతి సంస్థ అధ్యక్షురాలు దువ్వాడ లక్ష్మి భార్గవి కోరారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద చేపట్టిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దోషులను బహిరంగంగా ఉరి తీయాలని కోరారు. ఏయూ విశ్రాంత ఆచార్యుడు ఎస్.రామకృష్ణ, ప్రొఫెసర్ శాంతారామ్ మాట్లాడుతూ దేశం నలుమూలలా చిన్నారులు, మహిళల మీద వరుసగా లైంగిక దాడులు జరగడం దారుణమన్నారు. మహిళల పట్ల గౌరవంగా నడుచుకునేలా బాలురకు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ అలవాటు చేయాలని సూచించారు. అంతకు ముందు ఈ ర్యాలీ సీతమ్మధార పరిసర ప్రాంతాల మీదుగా అల్లూరి విగ్రహం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సురేష్‌బాబు, మురళీకృష్ణ, సంజీవ్, ఉష, వరలక్ష్మి, పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ల ఆవరణలో చెట్ల తొలగింపు



చెట్లు కొట్టివేయడంతో సుందరంగా కనిపిస్తున్న ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్

సీతమ్మధార : నగరంలోని బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల ఫోర్త్‌టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్ల ఆవరణలోని చెట్లు తొలగించడంతో సుందరంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ రెండు పోలీసు స్టేషన్లలో శాంతి భద్రతలు, క్రైం, ట్రాఫిక్ విభాగాల పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పోలీస్ స్టేషన్లను తనిఖీ చేస్తూ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో దట్టంగా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, పలు చెట్లు తొలగించారు. దీంతో పోలీస్ స్టేషన్ లుక్ పూర్తిగా మారిపోయింది. స్టేషన్ ఆవరణలోని చెట్లు కారణంగా బోర్డులు కూడా గతంలో బయటకు కనిపించేవి కాదు. ప్రస్తుతం స్టేషన్ మొత్తం పూర్తిగా కనిపిస్తోంది. మరోవైపు స్టేషన్ లోపల ఫర్నిచర్, సామగ్రి, ఇతర వస్తువులు సక్రమంగా వుండేలా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. రిసెప్షన్ కౌంటర్ వద్ద ఫిర్యాదుదారులకు సౌకర్యాలు మరింత మెరుగ్గా వుండేలా చర్యలు తీసుకున్నారు. రెండు స్టేషన్లలోనూ కేసుల వివరాలతో కూడిన బోర్డులను సీపీ ఆదేశాలతో ఏర్పాటు చేశారు.

హ్యాండ్‌బాల్ పోటీల విజేతలకు అభినందనలు



విద్యార్థులతో బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతమ్మధార : సత్యసాయి జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. సత్యసాయి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు కదిరి పట్టణంలో నిర్వహించారు. అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీల్లో బుల్లయ్య డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎల్.వెంకటేష్, ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆర్.నిఖిల్ విశాఖ జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించారు. ఈ మేరకు రేసపువానిపాలెంలో గల కళాశాలలో బుధవారం వీరిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లలితానగర్ చోరీ కేసులో చురుగ్గా దర్యాప్తు

సీతమ్మధార : ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెం సమీప లలితానగర్‌లో జరిగిన చోరీ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. ఇంకా నిందితుడు పరారీలోనే వుండడంతో పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. లలితానగర్‌లో నివసించే విశ్రాంత ఉద్యోగి ఎస్.హరిహరరావు కుటుంబ సభ్యులతో పది రోజులపాటు ఊరు వెళ్లి... మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి చోరీ జరగడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈస్టు క్రైం ఏసీపీ వెంకటరావు, సీఐ ఆదమ్, క్లూస్ టీం సిబ్బంది ఇంటికి చేరుకుని పరిశీలించి వెళ్లారు. ప్రస్తుతం పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. హరిహర రావు ఫిర్యాదు మేరకు టూ టౌన్ క్రైం ఇన్‌చార్జి ఎస్ఐ ఎం.సునీల్ చురుగ్గా కేసు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో సీతమ్మధార, బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని ఒక ఇంట్లో కిటికీ గ్రిల్ తొలిగించి చోరీ చేసిన సంఘటన, లలితానగర్ చోరీ ఒకే విధంగా జరగడంతో పోలీసులు పాత నేరస్తులపై నిఘా పెట్టారు. బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో జూన్ 17న జరిగిన చోరీ కేసులో నిందితులు బీహార్ కు చెందిన వారిగా గుర్తించారు. సదరు కేసులో ఒక దొంగ అరెస్టు కాగా, మరో దొంగ ఇంకా పరారీలోనే వున్నాడు. చోరీ సొత్తు కూడా స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగి రెండు నెలలు గడుస్తున్నా ఆ నిందితుడు దొరక్కపోవడం..., పైగా లలితానగర్‌లో గతంలోలానే మరో చోరీ జరగడం పోలీసులకు తలనొప్పిగా మారింది. ఈ చోరీ కేసులో స్థానిక దొంగల ప్రమేయంపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.

గురుకుల ప్రవేశాల్లో జిల్లా ఫస్ట్ ర్యాంక్



ఫస్ట్ ర్యాంకర్ మిథినేష్‌ను సత్కరిస్తున్న మండల విద్యా శాఖాధికారులు

మద్దిలపాలెం: గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో 15వ వార్డు వెంకోజీపాలెం జీవీఎంసీ స్కూల్ విద్యార్థి సీహెచ్.మిథినేష్ జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో మిథినేష్‌ను సీతమ్మధార మండల విద్యా శాఖాధికారి–1 రామారావు, విద్యా శాఖాధికారి–2 బాలామణి ఘనంగా సత్కరించారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల 6వ తరగతిలో ప్రవేశానికి మిథినేష్ పరీక్ష రాసి జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించడం గర్వకారణమని విద్యా శాఖాధికారులు కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులకు అభినందించారు.

ఆర్థిక ఆంక్షలు విధిస్తే అంగీకరించబోం



స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఉక్కునగరం: కార్మికులపై ఆర్థిక ఆంక్షలు విధించాలని చూస్తే అంగీకరించబోమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో పర్యటించి కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుత ప్లాంట్ పరిస్థితిని కార్మికులకు వివరించారు. యాజమాన్యం ముడి పదార్థాలు ఏర్పాటు చేయలేక కార్మికులపై ఆంక్షలు విధిస్తుందన్నారు. అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యాలు ప్లాంట్ పూర్తి ఉత్పత్తి తీయకుండా అడ్డుకుంటున్నాయని వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో యాజమాన్యం నడిపితే కచ్చితంగా లాభాలు సాధిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి నిర్వాసితులందరికీ న్యాయం చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే వేతన ఒప్పందం చేయాలన్నారు. ఈ డిమాండ్లపై గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, యు. రామస్వామి, నరేష్‌కుమార్, సురేష్‌బాబు, కొమ్ము ప్రసాద్, పి.వి. రమణమూర్తి, బి. డేవిడ్, బి. అప్పారావు, వై.టి. దాస్, కాంద్రేగుల శ్రీనివాసనాయుడు, మంత్రి గోపినారాయణ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పును సమీక్షించాలి



ఏయూ మెయిన్ గేట్ వద్ద రాస్తారోకో చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

విశాఖ సిటీ: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని, దీనిపై కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయాలని మాల జాయింట్ యాక్షన్ పోరాట కమిటీ, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్‌కు పిలుపు నివ్వడంతో ఉద్యమకారులు బుధవారం ఏయూ స్కూల్స్‌ను మూయించారు. యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. అవుట్ గేట్ వద్ద ఉన్న షాపులను బంద్ చేయించారు. ఈ సందర్భంగా సమితి నాయకుడు డాక్టర్ బోరుగడ్డ మోహన్‌బాబు మాట్లాడుతూ వర్గీకరణపై తీర్పు దేశ పార్లమెంటరీ వ్యవస్థకు, రాజ్యాంగానికి పెనుముప్పుగా పరిణమిస్తుందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆర్థిక పరమైన అంశాలను జోడించి క్రిమిలేయర్ తీసుకురావడం రిజర్వేషన్లను పూర్తిగా నిర్మూలించే కార్యక్రమంలా ఉందని ఆరోపించారు. దీన్ని ప్రతి ఒక్క భారతీయుడు వ్యతిరేకించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీల వర్గీకరణను, క్రిమిలేయర్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రొఫెసర్ జాన్, ప్రొఫెసర్ అర్జున్, ప్రొఫెసర్ సుబ్బారావు, ప్రొఫెసర్ సిద్ధయ్య, ప్రొఫెసర్ మునిస్వామి, ఆరేటి మహేష్, డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ శిరీష్, డాక్టర్ సుధీర్ పాల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు బుగ్గి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: మాదక ద్రవ్యాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో విద్యార్థులు కదం తొక్కారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం భారీ సంఖ్యలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాతగాజువాక జంక్షన్ నుంచి బయల్దేరిన ర్యాలీ సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్తగాజువాక జంక్షన్ వరకు కొనసాగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ మధ్య కాలంలో యువత వ్యసనాలకు బానిసలుగా మారి అనేక నేరాలకు పాల్పడుతోందన్నారు. మహిళలపై దాడులు పెరిగాయన్నారు. మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని వైద్య విద్యార్థి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.రాము, ఎల్‌జీ నాయుడు, నాయకులు సాయి, గుణ, కుసుమ, మౌని, అజయ్, నిఖిల్, సతీష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.